ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 71 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 24 జూన్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం



**రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం- రాజేంద్రప్రసాద్, మురళీమోహన్, రోహిత్‌కు అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి**

**ప్రముఖ మలయాళ జర్నలిస్ట్ పి. నారాయణన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.టి. థామస్‌కు పద్మవిభూషణ్- క్రికెటర్ రోహిత్ శర్మ, సీనియర్ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్, మాధవన్‌కు పద్మశ్రీ అవార్డులు**

**న్యూఢిల్లీ, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో అసాధారణ, విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలను ప్రదానం చేశారు. సాహిత్యం, విద్యా రంగానికి చేసిన విశేష సేవలకు గాను ప్రముఖ మలయాళ జర్నలిస్ట్ పి. నారాయణన్‌కు 'పద్మవిభూషణ్'ను ప్రదానం చేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.టి. థామస్ పద్మవిభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు.

**శిబు సోరెన్‌కు పద్మభూషణ్ అవార్డు**

ప్రవాస భారతీయుడు, ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ దత్తాత్రేయుడు నోరి పద్మభూషణ్ అవార్డు అందుకున్నారు. ఝార్ఖండ్ ముక్తి మోర్చా వ్యవస్థాపకుడు, దివంగత నేత శిబు సోరెన్‌కు ప్రకటించిన పద్మభూషణ్ అవార్డును ఆయన సతీమణి రూపీ సోరెన్ రాష్ట్రపతి నుంచి అందుకున్నారు. కళారంగానికి చేసిన సేవలకు గాను ప్రముఖ మలయాళ నటుడు మమ్ముట్టి, బాలీవుడ్ నేపథ్య గాయని అల్కా యాగ్నిక్‌లు పద్మభూషణ్ అందుకున్నారు. అలాగే, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, ..మిగతా 2లో

రెండు చోట్ల ఎన్యూమరేషన్ పత్రాలు నింపితే


# నోటీసులు జారీ!

**అధికారుల వార్నింగ్**

**వేర్వేరు రాష్ట్రాల్లో 2 ఎన్యూమరేషన్ పత్రాలు నింపితే భవిష్యత్తులో ఆ ఓటర్లకు ఇబ్బందులు**

**వేర్వేరు రాష్ట్రాల్లో ఓట్లు ఉంటే నోటీసులు**

**ఎస్ఐఆర్ ముగిశాక చర్యలుంటాయన్న ఎన్నికల అధికారులు**



**న్యూఢిల్లీ, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

ప్రత్యేక సమగ్ర సర్వే (ఎస్ఐఆర్)లో వేర్వేరు రాష్ట్రాల్లో 2 ఎన్యూమరేషన్ పత్రాలు నింపితే భవిష్యత్తులో ఆ ఓటర్లకు ఇబ్బందులు తప్పవని కేంద్ర ఎన్నికల సంఘం హెచ్చరిస్తోంది. భారత ప్రజాప్రాతినిధ్య చట్టం 31 ప్రకారం జైలు శిక్ష లేదా జరిమానా విధించే అవకాశాలు ఉంటాయని వెల్లడిస్తోంది.

రెండోసారి నమోదు చేసుకోవద్దు : తెలంగాణలో ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరాదికి చెందిన ప్రజలు ఉద్యోగం, వ్యాపార నిమిత్తం వచ్చి ..మిగతా 2లో

# హైదరాబాద్ మెట్రో విస్తరణకు గ్రీన్ సిగ్నల్

## కేంద్రమంత్రులతో రేవంత్ భేటీ సక్సెస్

**ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణకు కన్సల్టెంట్ నియామకం**

**కన్సల్టెంట్‌గా ఎస్‌బీఐ క్యాప్స్ - కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ**

**న్యూఢిల్లీ, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ మెట్రో రైలు స్వాధీనం, విస్తరణపై కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయి. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం ఖట్టర్ నివాసంలో ఈ అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్- 1 వాల్యుయేషన్, ఫేజ్-1 స్వాధీనానికి అవసరమైన రుణ సేకరణ, మెట్రో ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్రమంత్రులు, సీఎం ఏకాభిప్రాయానికి వచ్చారు. కన్సల్టెంట్‌గా ఎస్బీఐ క్యాప్స్‌ను ఎంపిక చేశారు. కన్సల్టెంట్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ : మెట్రో ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణ, ఇతర అంశాలపై ఎస్బీఐ ..మిగతా 2లో



# ఉగ్రవాదం, సైబర్ ముప్పులపై ఉక్కుపాదం మోపాలి

## బ్రిక్స్ దేశాలకు ప్రధాని మోదీ కీలక సందేశం



**న్యూఢిల్లీ, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

బ్రిక్స్ దేశాల జాతీయ భద్రతా సలహాదారులు సీనియర్ భద్రతా అధికారులతో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం రోజు సమావేశమయ్యారు. మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో ఉగ్రవాదం, సైబర్ భద్రత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలతో ఏర్పడుతున్న సవాళ్లను ఎదుర్కోవడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. సమావేశం అనంతరం సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో స్పందించిన మోదీ- బ్రిక్స్ దేశాల మధ్య భద్రతా సహకారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. టెర్రరిజం సహా సైబర్ దాడులు, ఇతర అన్ని రకాల సవాళ్లను ఎదుర్కొనేందుకు సభ్య దేశాలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. న్యూ ఢిల్లీ వేదికగా భారత జాతీయ భద్రతా సలహాదారు (చీఫా) అజిత్ డోభాల్ అధ్యక్షతన జరిగిన '16వ బ్రిక్స్ ఎన్ఎస్ఏ సమావేశం' విజయవంతమైంది. ఈ సదస్సుకు హాజరైన బ్రిక్స్ సభ్యదేశాల ఎన్ఎస్ఏలు, ఉన్నత స్థాయి భద్రతా అధికారుల బృందం ఆ తర్వాత మోదీతో సమావేశమైంది. ఈ సందర్భంగానే పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి.

2026లో బ్రిక్స్ కూటమికి భారతదేశం అధ్యక్షత వహిస్తోంది. గతంలో 2012, 2016, 2021 లలో కూడా అధ్యక్షత వహించగా ఇది నాలుగోసారి. ఇక ఈసారి రెసిలెన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్, సస్టైనబులిటీ (స్థిరత్వం, ఆవిష్కరణ, ..మిగతా 2లో

# కాంగ్రెస్ హామీలపై హరీష్ రావు ఫైర్


**రైతుబంధు, రుణమాఫీపై విమర్శలు.. కేసీఆర్ పాలనను గుర్తుచేసిన హరీష్**



**భద్రాద్రి కొత్తగూడెం జూన్ 23 (ప్రభాత ఉదయం)**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలకు, రైతులకు నమ్మకద్రోహం చేశారని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. హామీలు 100 రోజుల్లో నెరవేర్చకపోతే నిలదీయమన్న భట్టి విక్రమార్క మాటలను గుర్తు చేస్తూ.. మరి ఇపడు రండి, మిమ్మల్ని నిలదీస్తాం అని హరీష్ రావు సవాల్ విసిరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలపై హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేమిచ్చిన పంటల బోనస్ 3 సార్ల రైతు బంధు కంటే ఎక్కువ అని మంత్రి జూపల్లి కృష్ణారావు అంటుండు. అసలు జూపల్లికి తెలివి ఉందా.. అని మాజీ మంత్రి మండిపడ్డారు. అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల ..మిగతా 2లో

# అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు!




**న్యూఢిల్లీ, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (ఆనూ) ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటి వరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు.

# హర్మ్యూజ్‌లో.. ఒక్కరోజే 1.9 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా

**న్యూఢిల్లీ, జూన్ 23 (ప్రభాత ఉదయం)**



అమెరికా-ఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందంతో హర్మ్యూజ్ జలసంధిలో నౌకాయానం తిరిగి ఊపిరి పీల్చుకుంటోంది. తాజా పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. నిన్న ఒక్కరోజే 1.9 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు రవాణా జరిగిందని, ఇది ఆల్‌టైమ్ రికార్డు అని పేర్కొన్నారు. చమురు ధరలు పడిపోతున్నాయని.. ప్రపంచం సురక్షితమైన ప్రదేశంగా మారిందంటూ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు చేశారు. ఇక ఇరాన్‌తో ఒప్పందం గురించి ప్రస్తావిస్తూ.. భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఆ దేశం అంగీకరించిందన్నారు.

# రాష్ట్రపతి భవన్‌లో రెండో విడత పద్మ పురస్కారాల ప్రదానోత్సవం

మొదటి పేజీ తరువాయి...

స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నవారిలో సీనియర్ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు. సినీనటుడు =. మాధవన్ పద్మశ్రీ అందుకున్నారు. వీరితోపాటు పలు రంగాలకు చెందిన ప్రముఖులు ఈ పురస్కారాలను అందుకున్నారు.

**రామారెడ్డి మామిడికి మరణానంతరం పద్మశ్రీ**

ఇక, శాస్త్రవేత్త చంద్రమౌళి గడ్డమనుగుకు రాష్ట్రపతి ముర్ము పద్మశ్రీ అవార్డు అందజేశారు. డెయిరీ విభాగంలో రామారెడ్డి మామిడికి మరణానంతరం పద్మశ్రీ ప్రకటించగా కుటుంబ సభ్యులు స్వీకరించారు. ప్రసార భారతి మాజీ సీఈఓ, 'డీప్ టెక్ ఫర్ భారత్ ఫౌండేషన్' సహ వ్యవస్థాపకులు శశి శేఖర్ వెంపటి 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్నారు.

ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 5 పద్మవిభూషణ్‌లతో కలిపి మొత్తం 131 పద్మ అవార్డులను ప్రకటించింది. ఇందులో మే 25న జరిగిన తొలి విడత కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 65 మందికి పద్మ అవార్డులను ప్రదానం చేశారు. మిగిలిన వారికి ఇవాళ



జరిగిన రెండో విడత అవార్డుల కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు పాల్గొన్నారు.

**అవార్డు రావడంపై ఆనందం వ్యక్తం చేసిన పలువురు**

ఇదిలా ఉండగా, పద్మ అవార్డులు రావడంపై పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. లద్దాఖ్‌లోని సుదూర ప్రాంతానికి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోవా-రిగ్పా డైరెక్టర్ డాక్టర్ పద్మ గుర్మెట్‌కు పద్మశ్రీ అవార్డు వరించింది. హిమాలయ సాంప్రదాయ వైద్య విధానాన్ని పరిరక్షించడం, ప్రచారం చేయడంలో ఆయన చేసిన కృషికి గాను ఈ గౌరవం దక్కింది. అయితే, లద్దాఖ్ వంటి మారుమూల ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఈ అవార్డు దక్కడం తనకే కాకుండా మొత్తం సోవా-రిగ్పా సమాజానికి దక్కిన గొప్ప గౌరవమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

**320 పాఠశాలలు, కళాశాలల స్థాపన**

మరొక పద్మశ్రీ గ్రహీత, కర్ణాటక లింగాయత్ ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ ప్రభాకర్ బసప్రభు కోరే బెళగావి జిల్లాకు చెందినవారు. "గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలు లేని పిల్లల కోసం గత 42 ఏళ్లుగా సేవలందిస్తున్నా. దాదాపు 320 పాఠశాలలు, కళాశాలలను స్థాపించాం. మా విద్యాసంస్థల్లో సుమారు 1.48 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు" అని ప్రభాకర్ తెలిపారు. వీటితో పాటు ఇంకా ఎన్నో కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారు. అయితే, తాను సేవలను గుర్తించి అవార్డు ప్రధానం చేయడంతో ప్రభాకర్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, భారత ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

# హైదరాబాద్ మెట్రో విస్తరణకు గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి...

క్యాప్స్ సమగ్రంగా అధ్యయనం చేయనుంది. ఆ సంస్థ ఇచ్చే నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ చేపట్టనుంది. కన్సల్టెంట్ అధ్యయనం సమయంలో సమన్వయానికి ప్రతినిధులుగా కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శి ఉండాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ అధికారులు ఇద్దరు సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ వేగంగా సాగేందుకు కృషి చేస్తారు.

మెట్రో ఫేజ్-×× విస్తరణపై చర్చ : హైదరాబాద్ మెట్రో ఫేజ్-× స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై ఉన్న ఆటంకాలను తొలగించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులతో వరుసగా రెండు రోజులు సమావేశమయ్యారు. తొలుత సోమవారం సాయంత్రం రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో సుదీర్ఘంగా చర్చించారు. ఇవాళ కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, అశ్వినీ వైష్ణవ్‌లతో కలిసి ఖట్టర్‌ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి, దాదాపు అరగంట పాటు పలు అంశాలపై చర్చించారు. హైదరాబాద్ నగరంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు, మెట్రో రెండో దశ గురించి చర్చించినట్లు తెలుస్తోంది. సోమవారం రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను సీఎం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డిలు కలిసిన సమయంలో సానుకూల స్పందన వచ్చింది. అంతేకాదు స్వయంగా రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఖట్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఇవాళ కలుస్తారని కూడా తెలియజేశారు.

రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టులపై చర్చ : ఇవాల్టి ఖట్టర్ సమావేశంలో రైల్వే మంత్రి కూడా పాల్గొనడం శుభపరిణామంగా చెప్పొచ్చు. దిల్లీలో చోటు చేసుకున్న ఈ పరిణామాలను చూస్తుంటే రెండు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి వివిధ శాఖల కేంద్రమంత్రులను కలవడంతో సానుకూల స్పందన వస్తున్నట్లు తెలుస్తోంది. శనివారం ముంబయి వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి, అక్కడి నుంచి ఆదివారం దిల్లీ వెళ్లారు. నిన్న, ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి దిల్లీలో మకాం వేసి కేంద్రమంత్రులతో వరుసగా సమావేశమవుతూ రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర సహకారం కోరుతున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసిన సీఎం ప్రధానంగా మెట్రో విస్తరణ, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ) నుంచి రుణ సదుపాయం, హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థ విస్తరణ, ఇతర అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది.

రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కృషి చేస్తాను : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయమని కోరుతూ తనకు రెండుసార్లు లేఖ రాశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎక్స్ వేదికగా తెలిపారు. గత రెండు రోజులుగా తాను దిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రులతో సమావేశాలు ఏర్పాటు చేశానన్నారు. సోమవారం అశ్వినీ వైష్ణవ్‌తో జరిగిన సమావేశం, కేంద్ర మంత్రి ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌లతో జరిగిన సంయుక్త సమావేశం అనుకూల వాతావరణంలో జరిగాయని తెలిపారు. కేంద్ర మంత్రివర్గంలో తెలంగాణ ప్రతినిధిగా, తాను ఎల్లప్పుడూ తెలంగాణ అభివృద్ధికి, రాష్ట్ర ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

# రెండు చోట్ల ఎన్యూమరేషన్ పత్రాలు నింపితే నోటీసులు జారీ!

మొదటి పేజీ తరువాయి...

ఇక్కడే స్థిరపడ్డప్పటికీ, సొంత ప్రాంతాలతో సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఎంతో మందికి సొంత ప్రాంతాల్లో కూడా ఓటు హక్కు ఉంది. ఎస్‌ఐఆర్ ప్రక్రియ దశలవారీగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రక్రియ ముగిసిన రాష్ట్రాల్లోని వారు ఎన్యూమరేషన్ పత్రాలు అందించి అక్కడ ఓటు నమోదు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి ప్రారంభమవుతుంది. మహారాష్ట్ర, కర్ణాటక, దిల్లీలో సర్వే 30వ తేదీ నుంచి మొదలవుతుంది.

అయితే వేరే రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ పూర్తి చేసినవారు తెలంగాణ రాష్ట్రంలో, తెలంగాణలో పూర్తి చేసినవారు వేరే రాష్ట్రాల్లో ఎట్టిపరిస్థితుల్లో రెండోసారి నమోదు చేసుకోవద్దని కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు.

విచారణ చేశాక చర్యలు తీసుకుంటాం : తెలంగాణలో ఒకే వ్యక్తికి 2 చోట్ల ఓట్లు ఉంటే 'డెమోగ్రఫీ సిమిలర్ ఎంట్రీస్' ద్వారా అధికారులు గుర్తిస్తున్నారు. కానీ తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఓట్లు ఉంటే గుర్తించడానికి ప్రస్తుతానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్ లేదు. దీంతో ఈసీఐ వేరు వేరు రాష్ట్రాల్లో ఓట్లు ఉంటే గుర్తించడానికి ఏఐ సాంకేతికతతో కేంద్రీకృత వ్యవస్థను తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తోంది. సర్వే ప్రక్రియ పూర్తైన తర్వాత కేంద్రం తీసుకొచ్చే ఈ సాంకేతికతతో 2 ఓట్లు ఉన్నవారిని గుర్తించి, ఈఆర్వోలు విచారణ చేశాక చర్యలు తీసుకుంటామని అధికారులు అంటున్నారు.

ఒకే రాష్ట్రంలోనే ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపాలి : తెలుగు రాష్ట్రాల్లో ఓటర్లుగా నమోదైన ఎంతోమంది 2 రాష్ట్రాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారు. వీటిని కొనసాగించడానికి, తమ ఆస్తుల రక్షణకు తెలుగు రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ పత్రాలను నింపాలని ఆలోచిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని శివారు జిల్లాలకు చెందిన వారు ఉమ్మడి వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ఓటర్లుగా ఉన్నారు. మహారాష్ట్రకు చెందిన పలువురి పేర్లు ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో ఉన్నాయి. తెలంగాణ ఓటర్లు కూడా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు సరిహద్దు జిల్లాల్లో జీవనం సాగిస్తున్నారు. వలస కార్మికులది కూడా ఇదే పరిస్థితి. ఇలాంటి వారు చిక్కుల్లో పడకుండా ఒకే రాష్ట్రంలోనే ఎన్యూమరేషన్ పత్రాన్ని నింపాలని అధికారులు సూచనలు చేస్తున్నారు.

ఎవరి ఓటు తొలగించం : ఎస్‌ఐఆర్ సర్వేపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలంగాణ ప్రధాన ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి చెన్నయ్య తెలిపారు. బీఎల్‌వోలు అందించే ఎన్యూమరేషన్ పత్రం మీద మీకు తెలిసినంత వరకు సమాచారం ఇచ్చి సంతకం పెడితే చాలని, డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో మీ పేరు ఉంటుందని అన్నారు. ఆ పత్రంలో ఏమైనా సందేహాలు ఉంటేనే ఈఆర్వో నుంచి నోటీసులు వస్తాయని, అప్పుడు ధ్రువపత్రాలు సమర్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు తుది జాబితాలో ఉంటుందని స్పష్టం చేశారు. వివరణ తీసుకోకుండా ఎవరి ఓటు తొలగించమని హామీ ఇచ్చారు.

హైదరాబాద్ నగరంలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సంస్థ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఎస్‌ఐఆర్‌పై జర్నలిస్టులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటర్ల మ్యాపింగ్ జరిగినా, జరగకపోయిన ఓటర్ల జాబితాలో అర్హుల పేర్లు ఉంటాయని చెన్నయ్య స్పష్టం చేశారు. సర్వే అనంతరం బీఎల్‌వోల వారీగా ఎన్యూమరేషన్ పత్రాలు ఇచ్చిన వారి పేర్లు, ఇవ్వని వారి పేర్లు కూడా ప్రచురిస్తామని తెలిపారు. ఈసీఐనెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ఓటరు సందేహాలు దాదాపుగా పరిష్కారం అవుతాయని వెల్లడించారు.

# ఉగ్రవాదం, సైబర్ ముప్పులపై ఉక్కుపాదం మోపాలి

మొదటి పేజీ తరువాయి...

సహకారం, సుస్థిరత) అనే థీమ్‌తో భారత్ ముందుకు సాగుతోంది. అంటే ఈ ఇతివృత్తం ద్వారా సహకారం, ఆవిష్కరణలు, స్థిరత్వం, సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనుంది. ఈ సంవత్సరం భారత నాయకత్వంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, గ్లోబల్ సౌత్ దేశాల ప్రాధాన్యతలకు పూర్తి మద్దతు ఇవ్వడం వంటివి ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయని మోదీ చెప్పారు. మరింత సురక్షితమైన, సమగ్రమైన ప్రపంచ నిర్మాణానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని స్పష్టం చేశారు.

ఇక దిల్లీలో జరిగిన సమావేశానికి బ్రెజిల్, చైనా, రష్యా, సౌతాఫ్రికా, ఈజిప్ట్, యూఏఈ, ఇరాన్, ఇండోనేసియా, ఇథియోపియా, సౌదీ అరేబియా తదితర దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. బ్రిక్స్ చీూూ సదస్సుకు నేతృత్వం వహించిన భారత ఎన్ఎస్ఏ అజితే డోభాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ అనేది ప్రపంచంలోనే అత్యంత విశిష్టమైన, ప్రత్యేకమైన కూటమి అని అభివర్ణించారు. ప్రస్తుతం ప్రత్యేక ప్రాధాన్యం కలిగిన వేదికగా ఎదిగిందన్నారు. బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాలు ప్రపంచ రాజకీయ, ఆర్థిక, భద్రతా వ్యవస్థల్లో మరింత కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకున్నాయని వ్యాఖ్యానించారు.

**11 సభ్యదేశాల ప్రతినిధులు హాజరు**

ఈ బ్రిక్స్ ఉన్నత స్థాయి సదస్సులో బ్రిక్స్ కూటమిలోని 11 ప్రధాన సభ్యదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ, దక్షిణాఫ్రికా మంత్రి ఖుంబుజో, యూఏఈ జాతీయ భద్రతా మండలి ప్రధాన కార్యదర్శి అలీ మొహ్మద్ అల్ షంసీ, రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగూతో పాటు ఈజిప్ట్, ఇథియోపియా,బ్రెజిల్, ఇరాన్, ఇండోనేసియా దేశాలకు చెందిన అత్యున్నత రక్షణ, భద్రతా అధికారులు హాజరయ్యారు. సమావేశంలో సరిహద్దు భద్రత, ఆహార ఇంధన భద్రత, వాతావరణ మార్పులపై సుదీర్ఘంగా చర్చించారు.

**బ్రిక్స్ కూటమి దేశాలివే**

బ్రిక్స్ ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న 4 ప్రధాన దేశాల కూటమిగా మొదలైంది. ముందుగా బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాతో దీ=×జ గా ఏర్పడగా తర్వాత సౌతాఫ్రికా చేరడంతో దీ=×జూ గా మారింది. ఇటీవలి కాలంలో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియా, ఇండోనేసియా వంటి కొత్త దేశాలు ఈ కూటమిలో అధికారికంగా చేరాయి. దీంతో ప్రస్తుతం మొత్తం 11 సభ్య దేశాలుగా ఉన్నాయి. థాయిలాండ్, వియత్నాం, మలేసియా సహా మరికొన్ని దేశాలు భాగస్వామ్య దేశాల హోదాలో చేరాయి.

# ఎటిఎం క్యాష్ వ్యాన్ డ్రైవర్ పరార్

**17 లక్షల నగదుతో ఉడాయింపు**

**హైదరాబాద్, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ నగరంలోని పాతబస్తీలో మంగళవారం భారీ చోరీ కలకలం రేపింది. ఓ ఏటీఎం క్యాష్ వ్యాన్ డ్రైవర్.. రూ.17 లక్షల నగదును అపహరించి పరారయ్యాడు. పక్కా ప్రణాళికతోనే ఈ దొంగతనం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నగదును దొంగిలించిన అనంతరం సదరు డ్రైవర్, ముందుగానే అక్కడ సిద్ధంగా ఏర్పాటు చేసుకున్న బైక్‌పై ఎక్కి క్షణాల్లో మాయమయ్యాడు.పగటిపూట రద్దీగా ఉండే పాతబస్తీ ప్రాంతంలో ఈ తరహా భారీ చోరీ జరగడం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ చోరీకి పాల్పడిన నిందితుడిని పట్టుకునేందుకు చార్మినార్ పోలీసులు రంగంలోకి దిగారు. ఘటనా స్థలంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను సేకరించి, వాటి ఆధారంగా నిందితుడి కదలికలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. డ్రైవర్ కదలికలు, బైక్ వెళ్లిన దారి, ఘటనకు ముందు, తర్వాత అతడి ఫోన్స్ కాల్స్ పై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ భారీ స్కామ్‌లో డ్రైవర్‌కు బయటి వ్యక్తులు ఎవరైనా సహకరించారా అనే కోణంలో కూడా పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

**ఉచిత బీమా పథకం ప్రారభించనున్న సిఎం**

**హైదరాబాద్, జూన్ 23 (ప్రభాత ఉదయం)**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఉచిత జీవిత బీమా పథకాన్ని గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ పథకం కింద అర్హులైన ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.1.20 కోట్ల వరకు ఉచిత జీవిత బీమా రక్షణ కల్పించనున్నారు. సహజ మరణం, ప్రమాద మరణం వంటి సందర్భాల్లో బీమా ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు బ్యాంకులతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# కేంద్ర మంత్రులను కలిసిన తుమ్మల, ఉత్తమ్

**న్యూఢిల్లీ, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత జౌళి శాఖ మంత్రులు తుమ్మల, ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం న్యూఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన కీలక ప్రాజెక్టులు, రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, రైతుల ప్రయోజనాల పరిరక్షణ, దేశీయ వంటనూనెలఉ త్పత్తి పెంపుపై విస్తృతంగా చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్-ఆయిల్ పామ్ లక్ష్యాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని మంత్రి తుమ్మల వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరించగా, 70 వేల మందికిపైగా రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఈ విస్తీర్ణాన్ని 10 లక్షల



ఎకరాలకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భారత్ ప్రస్తుతం వంటనూనెల అవసరాల్లో దాదాపు 60 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోందని, ఈ పరిస్థితిని మార్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ఔఓఇక్ష-క్షఖ కార్యక్రమం దేశ ఆర్థిక వ్యవస్థకు, రైతాంగానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. అయితే ఇటీవల క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 44 శాతం నుంచి 16 శాతానికి తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుమతి సుంకం తగ్గింపుతో విదేశాల నుంచి చౌక ధరలకు పామాయిల్ దిగుమతులు పెరిగి దేశీయ మార్కెట్లో ధరలు పడిపోతున్నాయని, దీనివల్ల ఆయిల్ పామ్ రైతులు ఉత్పత్తి చేస్తున్న ఫ్రెష్ ఫ్రూట్ బంచ్‌లకు గిట్టుబాటు ధర లభించడం లేదని వివరించారు.

# కాంగ్రెస్ హామీలపై హరీష్ రావు ఫైర్

మొదటి పేజీ తరువాయి...

సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. రెండు బోనస్‌లు అయితే ఎగ్గొట్టినవ్.. పోయిన యాసంగి బోనస్ రూ.1200 కోట్లు, ఈ యాసంగి బోనస్ రూ. 1000 కోట్లు ఎగ్గొట్టినవ్ అని సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. అంతగొడితే నువ్వు బోనస్ ఇచ్చింది రూ.2500 కోట్లు.. కానీ మీరు ఎగగొట్టిన రైతు బంధు విలువ రూ.29,350 కోట్లు అని ధ్వజమెత్తారు. జూపల్లి తెలుసుకో లెక్క. చర్చ పెడదామా, అసెంబ్లీకి వచ్చి మాట్లాడదాం. నువ్వు ఇచ్చిన బోనస కేవలం 3వేల కోట్లు కూడా దాటదు. నువ్వేమైనా తెలిసి మాట్లాడు తున్నవా తెలియక మాట్లాడు తున్నవా.. చిన్న మెదడు ఏమైనా చితికిపోయిందా, నాకైతే అర్థమైతలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలకు ఎక్కువ చేతలకు తక్కువ. ఆయన దగ్గర మూడు శాఖలున్నాయి. విద్యాశాఖ, హోంశాఖ, మున్సిపల్ శాఖ ఈ మూడింటిలో కూడా అట్టర్‌ప్లాప్ అయిండని హరీశ్ రావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులుండి చేసింది గుండుసున్నా. రేవంత్ రెడ్డి మూడు శాఖలు పెట్టుకుని చేసింది కూడా గుండు సున్నా. విద్యాశాఖ మంత్రిగా ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణలో రేవంత్ రెడ్డి ఫెయిల్ అయిపోయిండు. మున్సిపల్ శాఖ, హోంమంత్రిగా ఫెయిల్ అయిండు. కానీ ఒక్క దాంట్లో మాత్రం పాసయ్యిండు. ఢిల్లీకి సంచులు మోసే శాఖలో మాత్రం పాసయ్యిండంటూ ఎద్దేవా చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన హామీలు , వాటిపై ఆయన ఎన్నిసార్లు మాట తప్పారో చూపే ప్రత్యేక వీడియోలను స్క్రీన్‌పై ప్లే చేస్తూ హరీష్ రావు కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రెండు పంటలకు రూ. 10 వేలు చొపన రైతుబంధు ఇస్తుంటే, తాము అధికారంలోకి వస్తే మూడు పంటలకు రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు నమ్మబలికారని హరీష్ రావు విమర్శించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని ఎందుకు అమలు చేయలేదని ఆయన నిలదీశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. కరోనా మహమ్మారి వంటి అత్యంత కఠినమైన ఆర్థిక పరిస్థితుల్లో కూడా ఎక్కడా ఆగకుండా 13 లక్షల రైతు కుటుంబాలకు రూ. 73 వేల కోట్ల రైతుబంధు నిధులను సకాలంలో అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని గుర్తు చేశారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా ప్రజలకు ఏం కావాలో ముందే గుర్తించి చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఇపడు అచ్చంపేట చూసినా, అశ్వారావుపేట చూసినా ప్రజలందరి నోటా 'మళ్లీ కేసీఆర్ రావాలి' అనే మాట ఒక్కటే వినిపిస్తోందని అన్నారు. రెండు లక్షల రైతు రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఎగ్గొట్టిందని హరీష్ రావు ధ్వజమెత్తారు. భద్రాద్రి రాముడిని సాక్షిగా పెట్టి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి, చివరకు ఆ దేవుడినే మోసం చేశారని, ఇక ప్రజలను మోసం చేయకుండా ఉంటారా అని ప్రశ్నించారు. త్వరలోనే మధిరలో భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు 'రైతు ఆశీర్వాద సభ' అని పేరు పెట్టడం రైతాంగాన్ని అవమానించడమేనన్నారు. రైతులను మోసం చేసినందుకు గానూ ఆ సభకు 'రైతు క్షమాపణ సభ'గా నామకరణం చేసుకోవాలని హరీష్ రావు ఎద్దేవా చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, మార్కెట్‌లో యూరియా దొరకడం లేదని, యాసంగి బోనస్ రెండు సార్లు ఇవ్వాల్సి ఉన్నా అడ్రస్ లేదని హరీష్ రావు విమర్శించారు. వడ్ల కొనుగోళ్లలో క్వింటాకు 5 కేజీల చొపన తరుగు తీస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు.

# ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేటట్లు బూత్ లెవల్ ఏజెంటు కృషి చేయాలి

**బుద్వేల్, జూన్ 23 ( ప్రభాత ఉదయం)**

ఈ నెల 25 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు జరుగనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ లో ఎక్కడ లోపాలు జరుగకుండ, అర్హులైన వారి ఓట్లు తొలగిం పబడకుండ కాంగ్రెస్ పార్టీ నుంచి నియమితులైన బూత్ లెవల్ ఏజెంట్లు పనిచేయాలని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ లు అన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం దుర్గానగర్ లోని దుర్గా కన్వెన్షన్ లో జరిగిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులనుద్దేశించి వారు ప్రసంగించారు. ఈ నెల 25 నుంచి జూలై 24వ తేదీ వరకు బూత్లవల్ ఆఫీసర్లు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు సేకరిస్తారని, కంగ్రెస్ పార్టీ రాజేం ద్రనగర్ నియోజకవర్గంలో నియమించిన 547 మంది బూత్ లెవల్ ఏజెంట్లు వారి వెంట ఉండి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు ఓటరు జాబితా లో ఉండేటట్లు చూడాలన్నారు. ఎక్కడ పొరపాట్లు జరుగకుండ బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో 6,34,924 మంది ఓటర్లు ఉన్నారని, వారందరికి బూత్ లెవల్ ఆఫీసర్లు ఎన్యుమరేషన్ ఫారమ్ లు ఇచ్చి వారం తర్వాత నింపి ఇవ్వాలని కోరుతారని, అందుకు గాను ప్రతి ఓటరుకు సహకరించే విదంగా పార్టీ ఏర్పాటు చేసిన బూత్ లెవల్ ఏజెంట్లు పనిచేయాలన్నారు. ఎన్యుమరేటర్ ఫామ్ నింపి ఇచ్చే సమయంలో ఓటరు యొక్క ప్రస్తుత ఫోటో తీసుకోవడం మరిచి పోవద్దన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 3,55, 658 మంది ఓటర్ల మ్యాపింగ్ అయినట్లు తెలుస్తుందని, మిగతా వారి పూర్తి వివరాలు తీసుకుని జీవించి ఉన్న వారి ఓట్లు తప్పకుండ ఉం డేటట్లు






ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో పాల్గొన్న భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ లు

మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు

చూడాలన్నారు. జూలై 31 తర్వాత ఓటరు జాబితా డ్రాఫ్ట్ వస్తుందని, దాంట్లో ఎవరి ఓటు లేకున్నా, తప్పులేమైనా ఉన్నా ఆగస్టు మాసంలో సవరణ చేసుకోవడానికి అవకాశం ఉ ంటుందన్నారు. అక్టోబరు 1వ తేదీన ఓటరు జాబితా తుది జాబితా ను విడుదల చేస్తారని, అప్పటి వరకు బూత్ లెవల్ ఏజెంట్లుగా నియమితులైన వారు అప్రమత్తంగా ఉండి ఓటర్ల మధ్య లో ఉంటు వారందరి పేర్లు జాబితా లో వచ్చే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని కార్యకర్తలకు అవగాహన కల్పించడానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ ఫెడరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి మాట్లాడుతూ, 2002 లో ఎక్కడ ఓటు వేశారో ప్రతి ఓటరు గుర్తుం చుకునేలా చూడాలన్నారు. దాన్ని బట్టి ఓటరు జాబితా లో సవరణ చేయడానికి అవకాశం ఉంటుం చన్నారు. ఇంటింటికి వచ్చే బూత్ లెవల్ ఆఫీసర్ ఇచ్చే ఎన్యుమరేషన్ దరఖాస్తు ను సరిగ్గా పూర్తి చేసి అందుకు కావాల్సిన ఆధారాలను జత చేసి, ఫోటో పెట్టి ఇస్తే ఎలాంటి ఇబ్బందులు ఉ ండవన్నారు. ఒక వేళ ఎవరి ఓటైన జాబితా లో లేకపోతే ఎందుకు నా ఓటు లేదని పలు మార్లు అడగవచ్చని, అంతకు స్పందించకపోతే హై కోర్టు లో కూడా అప్పీల్ చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బూత్లవల్ ఎజెంట్లు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మ దిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బి జ్ఞానేశ్వర్, హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అనిత జక్కాని, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తలారి మల్లేశ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్, ముంగి జైపాల్ రెడ్డి , టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ జల్ పల్లి నరేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాచమల్ల సిద్దేశ్వర్, ఆర్ గణేశ్ గుప్తా, మైలార్దేవుపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నత్తి ధనుంజయ, మహిళా నాయకురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



బుద్వేల్ లో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు వై శ్రీధర్, పి మల్లేష్ యాదవ్, పసుపుల సందీప్ ముదిరాజ్ తదితరులు



హైదర్ గూడ లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు ఎన్ మల్లారెడ్డి, ఎం


# డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గొప్ప దేశ భక్తుడు

**బుద్వేల్, జూన్ 23 (ప్రభాత ఉదయం):**

భారతీయ జనసంఘ్ (నేటి భారతీయ జనతా పార్టీ) వ్యవస్థాపకులు, అఖిల భారత హిందు మహ సభ అధ్యక్షునిగా పనిచేసిన విద్యావేత్త డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ ను మంగళవారం రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. బుద్వేల్, కాటేదాన్, మైలార్ దేవుపల్లి, హైదర్ గూడ ప్రాంతాలలో బీజేపీ డివిజన్ స్థాయి అధ్యక్షులు పసుపుల సందీప్ ముదిరాజ్, సూరెడ్డి వినయ్ రెడ్డి, గోద పాండు యాదవ్, సులిగె వెంకటేశ్ ల ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో బీజేపీ సీనియర్ నాయకులు వై.శ్రీధర్, ఎన్ మల్లారెడ్డి, ఎం కొమురయ్య, తోకల శ్రీనివాస్ రెడ్డి, ఆడికె రాజు, పి మల్లేశ్ యాదవ్, కాడెం సుదాకర్ లు మాట్లాడారు. ఏక్ దేశ్ మే ధో ప్రధాన్, దో విధాన్, డో నిషాన్ నయి చలేంగే అని పోరాడిన గొప్ప ధీ శాలి శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. పాకిస్థాన్ లో హిందువులను బాధపెట్టడం చూడలేక నెహ్రూ మంత్రి వర్గం నుంచి రాజీనామా చేసిన గొప్ప దేశ భక్తుడు ఆయన అని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కాటేదాన్ లో వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో....



మైలర్ దేవుపల్లి లో తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో....

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండే ప్రాంతాలు

**రాజేంద్రనగర్/బండ్లగూడ/శంషాబాద్, జూన్ 23(ప్రభాత ఉదయం)**

గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమత్రా నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉ ంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హర్షవర్ధన్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని మీనాక్షి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మీనాక్షి పేపర్ పరిశ్రమ, శాతం రాయి ప్రధాన రహదారి, శాతం రాయి పారిశ్రామిక వాడ, జై భవాని విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జై భవాని, పారిశ్రామికవాడ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలుపువేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**రాజేంద్రనగర్ లో...**

రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా మంగళవారం అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం దుర్గాప్రసాద్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని ఆర్టిఏ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎల్లమ్మ టెంపుల్, రెడ్డి బస్తి, కోర్టు ప్రాంతం, ఉప్పర్ పల్లి, ఉప్పర్ పల్లి హైదర్గూడా లీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎర్ర బోడ, వెంకటేశ్వర కాలనీ, చైతన్య విల్లాస్ కాలనీ, రాహుల్ గ్రాండ్యూర్, పి ఎల్ ఆర్ లగ్జరీ హోమ్స్, ప్రకాష్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన



పేర్కొన్నారు.

**శివరాంపల్లి లో...**

శివరాంపల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు ఎంబీఏ కాలనీ, రెడ్డి బస్తి, శ్యామలా నగర్, వీకర్ సెక్షన్, శ్రీకృష్ణ నగర్, నైట్ సెంటర్, ప్రశాంత్ కాలనీ, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం ఐదు గంటల వరకు గోల్డెన్ సిటీ, హెచ్ఎఫ్ కన్వెన్షన్, పిల్లర్ నెంబర్ 254, పిడబ్ల్యుడి వాటర్ పంప్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ తెలిపారు.

**కిస్మత్పూర్...**

కిస్మత్పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా లో ఆయా ప్రాంతాలలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజు తెలిపారు. ఎల్వీ ప్రసాద్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉ దయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు కేటీటి కాలనీ, శ్రీ బాలాజీ ఎంక్లేవ్, రాజా క్షేత్రం, గిరి దారి, గిరిదారి విస్టా, దర్గా కలుస్తాను, ఎల్.వి.ప్రసాద్, కీర్తి విల్లాస్, నమః, మ్యాప్ హర్ కన్స్ట్రక్షన్, 80 యాడ్స్, 60 యాడ్స్, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పి కాలనీ ఫీడర్ దగ్గర స్నేహిత హిల్స్ సబ్ష్టేషన్ పరిధిలో గల ప్రాంతాలైన ఆదర్శనగర్, బై రాగి గూడా, భవాని కాలనీ, బండ్లగూడ విలేజ్, చేవెళ్ల, చింతల్ మెట్ టవర్స్ సిటీ మీటర్స్, హిమగిరి కాలనీ, హెచ్డి బండ్లగూడ, హెచ్ వి నెట్ మీటర్, హెచ్ వి పి అండ్ పి సన్ సిటీ, హైదర్ షాకోట్, జేఎల్ఎంఎస్ కాలనీ, కాళికానగర్, పి అండ్ టీ కాలనీ, పి అండ్ టీ కాలనీ సి బ్లాక్, వీరం చెరువు, రాధానగర్, ఆర్ జి జి వై గృహ, సాయి హర్ష కాలనీ, ఎస్ఎంఆర్ బిల్డర్, శ్రీనివాస్ నగర్ కాలనీ, ఎస్టిఎల్, పిడబ్ల్యుఎస్, గంధం గూడ, సన్ సిటీ, విద్యాపీఠం, వికాస్ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలువ వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**శంషాబాద్ లో...**

శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమత్ర నిమిత్తం బుధవారం సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు. సెక్షన్ పరిధిలోని ఓల్డ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నర్కుడ, అండాపూర్, జూకల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచి వేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంకరాయానికి సహకరించాలని ఆయన కోరారు



అవగాహన ఒప్పందం లో వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఆస్కీ అధికారులు

# వ్యవసాయ వర్సిటీ, ఆస్కిల మధ్య అవగాహన ఒప్పందం

**బుద్వేల్, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, అడ్మినిసే టివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) ల మధ్య మంగళవారం అవగాహన ఒప్పందం కుదిరింది. వ్యవసాయ వర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య సమక్షంలో రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, ఆస్కి రిజిస్ట్రార్, సెక్రటరీ డాక్టర్ ఓ పి సింగ్ లు ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి సంబందించిన అంశాలలో మానేనవ వనరుల శిక్షణ, అభివృద్ధి, యాజమాన్య పద్దతులు, ఆధునిక పరిపాలన విధులు, పద్దతులు, ఎంటర్ప్రెన్యూర్షిప్ తదితర అంశాలలో కలసి పనిచేయాలని ఇరు సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం వ్యవసాయ వర్సిటీ కి సంబందించిన వివిధ కళాశాలల అసోసియేట్ డీన్స్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రాల అసోసియేట్ డైరెక్టర్ అఫ్ రీసెర్చ్, ఇతర ఉన్నతాధికారులకు ఆస్కి లో జూలై 13 నుం చి 15 తేదీలలో సీనియర్ మేనేజ్మెంట్, ఎక్జిక్యూటీవ్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రకటిం చుకున్నారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో ఆస్కి సెంటర్ ఫర్ అగ్రికల్చరల్ రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ వి ఉషారాణి, వ్యవసాయ వర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం బలరాం, విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి, వర్సిటీ మానవ వనరుల అభివృద్ధి కేంద్రం సంచాలకులు అయ్యాంగార్ పాల్గొన్నారు.



## ఇందిర మహిళా శక్తి ద్వారా
# మహిళలకు ఆర్థిక బలం

### ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**కూకట్ పల్లి, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, సాధికారతను లక్ష్యంగా పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "ఇందిర మహిళా శక్తి" కార్యక్రమంలో భాగంగా ఆల్విన్ కాలనీ డివిజన్లో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ స్వయం సహాయక సంఘాల మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి, ఆర్థిక పురోగతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని కుటుంబాలతో పాటు సమాజ అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించాలని సూచించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన మహిళకు చేరేలా అందరూ కృషి చేయాలని కోరారు. చీరలు అందుకున్న మహిళలు ప్రభుత్వానికి, కార్యక్రమ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, సంతోష్, సౌందర్య, సురేఖతో పాటు పెద్ద సంఖ్యలో స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారి సంక్షేమానికి తోడ్పడే ఇందిర మహిళా శక్తి కార్యక్రమం మహిళల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.



జన సేనలో చేరిన కార్యకర్తలు

# జనసేనలోకి భారీగా చేరికలు

### రాష్ట్ర అధ్యక్షులు వేముల శంకర్ గౌడ్

**బుద్వేల్ , జూన్ 23 (ప్రభాత ఉదయం) :**

జనసేన అధినేత, ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్ సిద్ధాంతాలకు యువకులు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని రాష్ట్ర అధ్యక్షులు వేముల శంకర్ గౌడ్, హైదరాబాద్ ఇన్చార్జ్ దామోదర్ రెడ్డి లు తెలిపారు. మంగళవారం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని యువకులు గోదాల భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో 50 మంది యువకులు శంకర్ గౌడ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. పార్టీ లో చేరిన వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ... జనసేన పార్టీలో చేరిన యువకులకు సరైన అవకాశాలు కల్పిస్తూ కంటికి రెప్పల కాపాడుకుంటామని తెలిపారు.యువత ఆశలు, ఆశయాలకు అనుగుణంగా నాయకత్వం వహించే లక్షణం పవన్ కళ్యాణ్లో ఉండటంతో వివిధ పార్టీ ల నాయకులు, యువకులు జనసేన పార్టీ చేరడానికి సరైన వేదికగా నిర్ణయించుకుంటున్నారని తెలిపారు. జన సైనికుడిగా ఆ పార్టీ సిద్ధాంతాలను జనంలోకి తీసుకెళ్లి, తెలంగాణలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని గోదాల భాస్కర్ తెలిపారు. పార్టీలో చేరిన వారిలో ప్రదీప్ కుమార్, కోటిరెడ్డి, మామిడి సుధాకర్, మంగలి మహేష్, పెంద్యాల లక్ష్మణ్, దశరథ్, రమేష్, ప్రసాద్, మహేష్ తదితరులు ఉన్నారు.

# రైతులకు శాస్త్రీయ పరిశోధన ఫలితాలు చేరాలి

## ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దండ రాజి రెడ్డి

**రాజేంద్రనగర్, జూన్ 23(ప్రభాత ఉదయం)**




రైతులకు శాస్త్రీయ పరిశోధన ఫలితాలు చేరాలని ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దండ రాజి రెడ్డి అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో 12వ రాష్ట్ర స్థాయి సాంకేతిక కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. విశ్వవిద్యాలయ ఉపకులపతి (వైస్ ఛాన్సలర్) డాక్టర్ దండ రాజి రెడ్డి ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జూన్ 23 నుండి 25 వరకు మూడు రోజుల పాటు ఈ సాంకేతిక సదస్సు కొనసాగనుంది. ఈ సందర్భంగా ఉపకులపతి డాక్టర్ దండ రాజి రెడ్డి అధ్యక్షోపన్యాసంలో మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు ప్రయోగశాలల్లో చేసే పరిశోధనల ఫలితాలు ఆలస్యం కాకుండా వెంటనే క్షేత్రస్థాయిలోని ఉద్యాన రైతులకు చేరాలని ఆకాంక్షించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు సమాచార సాంకేతిక పరిజ్ఞానాన్ని (ఐటీ), ఆధునిక కృత్రిమ మేధస్సును (ఏఐ) వినియోగించుకుంటూ శాస్త్రవేత్తల సలహాలను సకాలంలో అందుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని కూరగాయలు, పూలు, పండ్ల ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ (ఆహార శుద్ధి) రంగంలో పరిశోధనలు ముమ్మరం చేయాలని, దీనివల్ల కోత అనంతర నష్టాలను నివారించవచ్చని శాస్త్రవేత్తలకు దిశా నిర్దేశం చేశారు. ఉద్యాన రైతులు ఆహార శుద్ధి పరిశ్రమల వైపు మొగ్గు చూపాలని కోరుతూ, త్వరలోనే సరికొత్త సాంకేతిక సలహాలను రైతులకు అందుబాటులోకి తెస్తామని ఆయన ప్రకటించారు.అనంతరం నిపుణులు డాక్టర్ ఐ. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో మిర్చి, పసుపు వంటి సుగంధ ద్రవ్యాల పంటలపై శాస్త్రవేత్తలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. శాస్త్రవేత్తలు నిరంతరం సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అప్డేట్గా ఉండాలని పిలుపునిచ్చారు.డాక్టర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ... రైతులకు వాతావరణ ఆధారిత ఉద్యాన సూచనలు అందించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ వై.జి. ప్రసాద్ వాతావరణ మార్పులను తట్టుకునే 'క్లైమేట్ స్మార్ట్ హార్టికల్చర్' మరియు ఉద్యానవన రంగంలో సమాచార సాంకేతికత అమలుపై సమగ్రంగా మాట్లాడారు.ఈ సదస్సులో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఏ. భగవాన్, డీన్ ఆఫ్ హార్టికల్చర్ మరియు డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ జె. చీనా, యూనివర్సిటీ కన్సల్టెంట్ డా.కె.వీరాంజనేయులు, టెక్నికల్ అడ్వైజర్ డా.జి.పి. సునందిని, పరిశోధనా విభాగం సంచాలకులు డాక్టర్ డి. లక్ష్మీనారాయణ, విస్తరణ విభాగం సంచాలకులు డాక్టర్ టి. సురేష్ కుమార్, విశ్వవిద్యాలయ గ్రంథాలయాధికారి డా. ఎం. రాజశేఖర్, సాంకేతిక కార్యదర్శి పిడిగాం సైదయ్య పాటు బోధన సిబ్బంది, మరియు పెద్ద సంఖ్యలో రైతులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వివిధ అగ్రో-క్లైమాటిక్ జోన్ల అధిపతులు, పరిశోధనా స్థానాల అధిపతులు, కళాశాలల అసోసియేట్ డీన్లు, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, బోధనా సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.




# విద్యార్థులపై ప్రేమ ఉంటే రాజకీయాలు కాదు, వారి సమస్యలపై పోరాడాలి

## తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్

**కూకట్ పల్లి, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు అందలేదనే కారణంతో ఏబీవీపీ మంగళవారం బంద్‌కు పిలుపునివ్వడం విచారకరమని తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్ అన్నారు. ఈ సందర్భంగా గొల్ల జాన్ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన నీట్ పేపర్ లీక్ ఘటనపై ఎందుకు నోరు మెదపలేదని అన్నారు.విద్యార్థులు ఆందోళనకు గురైనప్పుడు ఎన్ టి ఏ వైఫల్యాల వల్ల వారి కలలు చిద్రమైనప్పుడు ఏబీవీపీ నాయకులు ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఎందుకు ఎన్ టి ఏ ను రద్దు చేయాలని డిమాండ్ చేయలేదు? ఎందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించలేదని అన్నారు.తెలంగాణ ఎన్ ఎస్ యు ఐ తరఫున మేము స్పష్టంగా చెబుతున్నాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆధునిక సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తోందని, విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధే మా ప్రధాన లక్ష్యం అని తెలిపారు.ఏబీవీపీ నాయకులు నిజంగా విద్యార్థుల పక్షాన ఉంటే, ప్రతి సంవత్సరం జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని, అనవసర రాజకీయ డ్రామాలకు బదులుగా విద్యార్థుల హక్కుల కోసం కలిసి పోరాడాలని, విద్యార్థుల ప్రయోజనాల కోసం ఎన్ ఎస్ యు ఐ ఎప్పటికీ ముందుంటుందని అన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రణాళికతో నిర్వహించాలి

## ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 23(ప్రభాత ఉదయం):**



ఓటరు జాబితాను తప్పులు లేకుండా సమగ్రంగా రూపొందించేందుకు చేపట్టిన ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా ఈనెల 25 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ అన్ని మండలాల తహసిల్దార్లు, బిఎల్ఓ లు, ఇతర అధికారులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల వారీగా సంబంధిత బిఎల్వోలు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన అంశాలన్నింటిని ఓటర్లు ఫారాలలో పూరించేలా అవగాహన కలిగించాలన్నారు. ఈ విషయంలో బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారం కూడా తీసుకోవచ్చన్నారు. బిఎల్ఓ లు ప్రతిరోజు ఎన్ని ఇండ్లు తిరుగుతున్నారు, ఓటర్ల నుంచి ఫిలప్ చేయబడ్డ ఫారాలు ఎన్ని తిరిగి వచ్చాయనే సమగ్ర డేటాను ఎప్పటికప్పుడు సంబంధిత యాప్ లో నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ అధికారులు ప్రతిరోజు రివ్యూ నిర్వహించనున్నట్లు చెప్పారు. బి ఎల్ఓ లకు ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని, ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత తహసిల్దారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవచ్చన్నారు. ఎవరైనా ఓటర్లు నిర్దేశిత వెబ్సైట్లో స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకోవడానికి కూడా అవకాశం ఉందన్నారు. 2002 ఓటర్ లిస్టును ప్రామాణికంగా తీసుకొని ప్రస్తుతం ఎలాంటి తప్పులు లేని సమగ్ర ఓటర్ జాబితాను పకడ్బందీగా రూపొందించేందుకు ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ పై మాస్టర్ ట్రైనర్ తిమ్మారెడ్డి క్షుణ్ణంగా వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, సూపర్వైజర్లు, బిఎల్ఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ విజయవంతం : ఏబీవీపీ

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 23(ప్రభాత ఉదయం)**




అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ నియంత్రణ, విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఈ బంద్ నిర్వహించబడింది.

ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేష్ పటేల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో విద్యకు ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించినప్పటికీ, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, యూనిఫాంలు మరియు పాఠ్యపుస్తకాల పంపిణీలో జాప్యం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని అన్నారు.

రాష్ట్రంలోని 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 23 వేల పాఠశాలలను మూసివేస్తామన్న ప్రకటనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం గ్రామీణ, ఆదివాసీ, గిరిజన, దళిత మరియు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

మరోవైపు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం తీసుకొస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని, విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపును కచ్చితంగా అమలు చేయాలని కోరారు.

**డిమాండ్లు:**

27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 23 వేల పాఠశాలలను మూసివేస్తామన్న ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలి.

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టి ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి.

విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపును పకడ్బందీగా అమలు చేయాలి.

ఖాళీగా ఉన్న వీజూ, ఐజూ, టీచింగ్ మరియు నాన్-టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, యూనిఫాంలు మరియు పాఠ్యపుస్తకాలను వెంటనే అందించాలి.

గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించి, నాణ్యమైన భోజనం అందించాలి. జాతీయ విద్యా విధానం (చీజూ-2020) అమలు చేయాలి.

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని తక్షణమే అమలు చేయాలి. ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలను నిషేధించాలి.

ప్రభుత్వం విద్యా రంగ సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని ఏబీవీపీ హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో ఎం ఏ ఎల్ డి కాలేజ్ అధ్యక్షులు తేజ మరియు కళామంచు కన్వీనర్ నరేష్ , నరేష్ కుమార్ సోషల్ మీడియా ఇన్చార్ సురేష్ విష్ణు తదితరులు పాల్గొనడం జరిగింది



# గార్లపాడులో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించిన చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య

## భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ నెలపూజ, పోలమ్మ అవ్వ పండుగ ఉత్సవాలు

## అమ్మవార్లను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ముఖ్య అతిథి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 23(ప్రభాత ఉదయం)**

ధరూర్ మండలం గార్లపాడు గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ నెలపూజ పోలమ్మ అవ్వ పండుగ ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను మంగళవారం తెలంగాణ రాష్ట్ర గొర్రెలు , మేకల అభివృద్ధి సహకార చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య ముందుగా శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ, పోలమ్మ అవ్వ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గార్లపాడు గ్రామ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గార్లపాడు సర్పంచ్ పరిమల శివరాజ్ , గుడ్డెందొడ్డి సర్పంచ్ పద్మావతి నర్సింహులు, పెద్దపల్లి సర్పంచ్ శిరీష రాజశేఖర్ రెడ్డి,నాయకులు అదిమల్లారెడ్డి, పటేల్ శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, ఆనంద్ గౌడ్, తోటరాముడు, మల్లేష్, ఆంజనేయులు, పోస్ట్ వెంకటరెడ్డి, నాగేందర్, ప్రహ్లాద్, రాధాకృష్ణ, జంగిలప్ప, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



# నాణ్యమైన విత్తనమే అధిక దిగుబడికి తొలి అడుగు

## ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యం

## కేటిదొడ్డి, మైలగడ్డ రైతు వేదికలో విత్తన మేళా విజయవంతం

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 23(ప్రభాత ఉదయం)**

కేటిదొడ్డి మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కేటిదొడ్డి, మైలగడ్డ రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా (సీడ్ మేళా) ప్రచార కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వ హన్మంతు మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన ధృవీకరించిన విత్తనాలు అందించడంతో పాటు ఆధునిక సాగు పద్ధతులు, పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విత్తన మేళాలో నాణ్యమైన ధృవీకరించిన విత్తనాల వినియోగం, అధిక దిగుబడులు ఇచ్చే వంగడాల ఎంపిక, పంటల వైవిధ్యీకరణ, నీటి లభ్యతకు అనుగుణమైన పంటల సాగు, సమగ్ర పంట సంరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధిక దిగుబడి వరి రకాలను రైతులకు పరిచయం చేశారు. అలాగే అధిక నీటి అవసరం ఉన్న పంటలకు ప్రత్యామ్నాయంగా కంది, పెసర, మినుములు, శనగలు, నువ్వులు, కూరగాయల పంటలను సాగు చేయాలని సూచించారు. నానో యూరియా వినియోగం వల్ల నత్రజని ఎరువుల సామర్థ్యం పెరగడంతో పాటు సాధారణ యూరియా వినియోగం తగ్గి దిగుబడి మెరుగుపడుతుందని ఏఓ రాజవర్ధన్ రెడ్డి వివరించారు. రైతులు ధృవీకరించిన విత్తనాలనే కొనుగోలు చేయాలని, విత్తన ప్యాకెట్లపై లాట్ నంబర్, మొలక శాతం, గడువు తేదీలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు, మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి, ఎఇఓలు ప్రవల్లిక, శివ, కిరణ్ కుమార్,ఎరువుల దుకాణాల యజమానులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జిల్లాలోని వసతి గృహాలు, పాఠశాలలు,రేషన్ దుకాణాలకు నాణ్యమైన బియ్యం సరఫరా

## పౌర సరఫరాల శాఖ జనరల్ మేనేజర్ భాస్కర్ రావు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

ఆహార భద్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని పౌరసరఫరాల శాఖ జనరల్ మేనేజర్ ఈ. భాస్కర్ రావు అన్నారు.మంగళవారం గద్వాల్ లోని కేజీబీవీ గద్వాల (గోనుపాడు), ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల గద్వాల,తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ గద్వాల, కుంటవీధి (గద్వాల) రేషన్ దుకాణం మరియు ఎర్రవల్లి మండలంలో తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజ్ బీచుపల్లి, కొండేరు రేషన్ దుకాణంను ఆయనఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ జనరల్ మేనేజర్ ఈ. భాస్కర్ రావు మాట్లాడుతూ, జిల్లాలోని వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలల్లో నాణ్యమైన బియ్యం వినియోగిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు సూచించారు. బియ్యాన్ని తేమ లేకుండా గాలి, వెలుతురు ప్రసరణ ఉండే ప్రదేశాల్లో నిల్వ చేయాలన్నారు.వంటశాలలు, నిల్వ గదుల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. రేషన్ దుకాణాల్లోనూ నాణ్యమైన బియ్యంను పారదర్శకంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. అంతక ముందు కేజీబీవీ గద్వాలో వంటశాల,ఆహార నిల్వ గదులను తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా వారికి అందిస్తున్న ఆహారం నాణ్యత, రుచిపై ఆరా తీశారు.ఈ తనిఖీలలో సాంకేతిక సహాయకులు రెహమాన్,జిల్లా మేనేజర్ విమల,డిప్యూటీ తహసీల్దార్ వాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్ పబ్‌లపై 'ఫైర్' పంజా!



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రమేష్..



సమావేశాని హాజరైన గ్రేహౌండ్స్ సిబ్బంది..



### స్కై 100, ఆరా నైట్ క్లబ్‌లలో అగ్నిమాపక అధికారుల మెరుపు తనిఖీలు.. విస్తుపోయే నిజాలు!

### నిబంధనలు గాల్లోకి.. ప్రాణాలు పణంగా.. నోటీసులు జారీ చేసిన డీఎఫ్ఓ ఖాజా కరీం!

**శేరిలింగంపల్లి జూన్ 23, (ప్రభాత ఉదయం)**

నగరంలో నైట్‌లైఫ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఐటీ కారిడార్‌లో నిబంధనల ఉల్లంఘనలు బట్టబయలయ్యాయి. ఇటీవల రాష్ట్రంలో వరుసగా చోటుచేసుకుంటున్న ఘోర అగ్నిప్రమాదాలు అమాయక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్న ఉదంతాల నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అధికారులు ఎట్టకేలకు మేల్కొన్నారు. మాదాపూర్‌లోని ప్రముఖ పబ్‌లు, నైట్ క్లబ్‌లే లక్ష్యంగా జిల్లా అగ్నిమాపాక అధికారి (డీఎఫ్ఓ) ఖాజా కరీం నేతృత్వంలో ఫైర్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు భద్రతా లోపాలు వెలుగులోకి రావడం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

**ముకుతాడు లేని వ్యాపారాలు.. అనుమతులకు మించి కార్యకలాపాలు!**

మాదాపూర్‌లోని అత్యంత రద్దీగా ఉండే ప్రాంతంలోని స్కై 100 పబ్, ఆరా నైట్ క్లబ్ లలో అధికారులు అంగుళం అంగుళం పరిశీలించారు. ఫైర్ అండ్ లైఫ్ సేఫ్టీ ప్రమాణాల పరిశీలనలో యాజమాన్యాల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. ప్రభుత్వం నుంచి పొందిన అనుమతులకు అక్కడ జరుగుతున్న వాస్తవ వ్యాపారానికి అస్సలు పొంతన లేదని అధికారులు గుర్తించారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ అదనపు వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ కేవలం లాభాలే ధ్యేయంగా యువత ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు తనిఖీల్లో తేలింది. ఈ ఉల్లంఘనలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అధికారులు యాజమాన్యాలకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

**సింగిల్ ఎగ్జిట్.. మైండ్ బ్లాక్ అయ్యే లోపాలు!**

అగ్నిప్రమాద నివారణ చట్టాల ప్రకారం 15 మీటర్లకు పైగా ఎత్తు ఉన్న వాణిజ్య భవనాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు సురక్షితంగా బయటపడటానికి ఖచ్చితంగా రెండు అత్యవసర మెట్ల మార్గాలు (ఎమర్జెన్సీ ఎగ్జిట్లు) ఉండాలి. కానీ అధికారులు తనిఖీ చేసిన రెండు ప్రాంగణాల్లోనూ కేవలం ఒకే ఒక్క మెట్ల మార్గం ఉన్నట్లు గుర్తించారు. వారాంతాల్లో వందలాది మందితో ఈ పబ్‌లు కిక్కిరిసిపోతాయి. ఒకవేళ పొరపాటున షార్ట్ సర్క్యూట్ లేదా మరేదైనా కారణంతో అగ్నిప్రమాదం సంభవిస్తే ఉన్న ఒక్క మెట్ల మార్గం గుండా అంతమంది ఒకేసారి బయటకు రావడం అసాధ్యం. ఇది తొక్కిసలాటకు దారితీసి ఊపిరాడక భారీ ఎత్తున ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనాల్లో కనీస వెలుతురు పొగ బయటకు పోయే వటటంటిలేషన్ వ్యవస్థలు కూడా లోపభూయిష్టంగా ఉన్నట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. ఈ తనిఖీలు తదుపరి చర్యల గురించి జిల్లా అగ్నిమాపాక అధికారి (డీఎఫ్ఓ) ఖాజా కరీం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. చట్టపరమైన నిబంధనల ప్రకారం దశలవారీగా చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. తనిఖీలకు ముందే నిబంధనల ప్రకారం నోటీసు జారీ చేసి, పారదర్శకంగా తనిఖీలు నిర్వహించామన్నారు. ఫామ్-12 నోటీసు తనిఖీల్లో తేలిన లోపాలను ఎత్తిచూపుతూ, యాజమాన్యాలు తక్షణమే తీసుకోవాల్సిన భద్రతా చర్యలను సూచిస్తూ త్వరలోనే ఫామ్ 12 నోటీసులు జారీ చేనున్నామన్నారు. నోటీసు అందిన నాటి నుండి యాజమాన్యాలకు సరిగ్గా 30 రోజుల గడువు ఇస్తామని, ఆ లోపు లోపాలను సరిదిద్ది, రెండో ఎమర్జెన్సీ ఎగ్జిట్ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇచ్చిన గడువులోగా భద్రతా ప్రమాణాలు పాటించని పక్షంలో సదరు పబ్‌లు, నైట్ క్లబ్‌లపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే సీజ్ చేయడానికి కూడా వెనకాడబోమని ప్రజల ప్రాణ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తి లేదని డీఎఫ్ఓ హెచ్చరించారు. ఇటీవలి కాలంలో హైదరాబాద్ నగరంలో వరుస అగ్నిప్రమాదాలు జరుగుతున్నా పబ్స్, కమర్షియల్ కాంప్లెక్స్ ల యాజమాన్యాల్లో మార్పు రాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు కేవలం నోటీసులతో సరిపెట్టకుండా, నిరంతరం నిఘా ఉంచాలని, నిబంధనలు పాటించని వారి లైసెన్సులు రద్దు చేయాలని స్థానికులు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. మాదాపూర్ ఐటీ కారిడార్‌లో మొదలైన ఈ తనిఖీలు నగరవ్యాప్తంగా ఉన్న అన్ని పబ్‌లు, మాల్స్ లోనూ జరగాలని ప్రజలు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

## రైతు ఆదాయ భద్రతపై వ్యవసాయ వర్సిటీలో సదస్సు

**బుద్వేల్, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

రైతుల ఆదాయం పెంపొందించేందుకు అవసరం అయిన అన్ని చర్యలు తీసుకునేందుకు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. రైతు ఆధాయ భద్రత- మార్గాలు, ప్రత్యామ్నాయ విధానాలు అన్న అంశంపై మంగళవారం రాజేంద్రనగర్ లోని విస్తరణ విద్యా సంస్థ లో సదస్సు జరిగింది. ఈ సదస్సు లో పాల్గొన్న ప్రొఫెసర్ అల్టాస్ జానయ్య మాట్లాడుతూ, రైతుల ఆదాయ మార్గాలను పెంచడానికి కావాల్సిన జాగ్రత్తలు తీసుకునే బాధ్యతను, సాంకేతిక అంశాలను సూచించే నోడల్ ఏజెన్సీ బాధ్యతను వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అప్పగించారన్నారు. అందుకోసం బాగస్వాముల అభిప్రాయాలు తీసుకోవడానికి ఈ సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రకృతి వనరులను పరిరక్షిస్తునే రైతుల ఆదాయం పెంచాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ప్రభుత్వ విధానాల తో పాటు అనేక ఇతర కారణాల వల్ల వరి విస్తీర్ణం బాగా పెరిగిందన్నారు. అవసరానికి మించి పెరిగిన వంరి ఉత్పత్తి కొనుగోలు, నిల్వల సవాళ్లు ఎదురౌతున్నాయని ప్రొఫెసర్ జానయ్య అభిప్రాయపడ్డారు. వరి సహ అన్ని పంటలకు సంబందించి విలువ జోడింపు, ఉప ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సదస్సులో వ్యవసాయ రంగ నిపుణులు అరిబండి ప్రసాద్ రావు, రైతు సంఘాల ప్రతినిధులు సారంపల్లి మల్లారెడ్డి, జయపాల్ రెడ్డి, సాగర్, నరేందర్ రెడ్డి, రైతులు లింగయ్య, చంద్రశేఖర్, లక్ష్మీకాంత్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.



## ఫిరోజ్‌గూడ శ్మశానవాటికకు సరికొత్త రూపు

### సౌకర్యాల కల్పనకు వేగంగా సుందరీకరణ పనులు

### డివిజన్ ప్రజలకు మరింత మెరుగైన వసతులే లక్ష్యం

### మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

**కూకట్ పల్లి, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

కూకట్‌పల్లి నియోజకవర్గం, బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్‌గూడ శ్మశానవాటికలో చేపడుతున్న సుందరీకరణ, అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మంగళవారం శ్మశానవాటికలో జరుగుతున్న పనులను బాలానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. శ్మశానవాటికను ఆధునిక వసతులతో తీర్చిదిద్దుతూ ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆవుల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, శ్మశానవాటికకు వచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అంత్యక్రియల సమయంలో కుటుంబ సభ్యులు, బంధువులు సౌకర్యవంతంగా ఉండేందుకు విశాలమైన హాల్ నిర్మాణం చేపట్టామని చెప్పారు. అలాగే కూర్చునేందుకు ప్రత్యేకంగా మార్బుల్ బెంచీలు, విశ్రాంతి ప్రాంతాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా మహిళలు, పురుషుల కోసం విడివిడిగా స్నానాల గదులు, వాష్‌రూమ్‌ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ శ్మశానవాటిక పరిసరాలను అందంగా తీర్చిదిద్దే పనులు జరుగుతున్నాయని చెప్పారు. భవిష్యత్తులో ప్రజలకు అవసరమయ్యే మరిన్ని సౌకర్యాలను కూడా దశలవారీగా కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. శ్మశానవాటిక అనేది ప్రతి కుటుంబానికి అవసరమయ్యే ప్రజా సదుపాయమని, అలాంటి ప్రదేశాల్లో మౌలిక వసతులు మెరుగుపడటం ద్వారా ప్రజలు ఇబ్బందులు లేకుండా అంత్యక్రియల కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని రవీందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అన్ని పనులు ప్రమాణాలకు అనుగుణంగా పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిరోజ్‌గూడ బస్తి వ్యవస్థాపకులు ఎడ్ల సదానంద్, పి. యాదయ్య, నాయకులు మందడి సుధాకర్ రెడ్డి, ఎడ్ల ప్రభాకర్, ఎడ్ల కవిత, స్థానిక బస్తి వాసులు మల్లారెడ్డి, ఎడ్ల అశోక్, వై. సత్యనారాయణ, కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారు శ్మశానవాటిక అభివృద్ధి పనులను స్వాగతిస్తూ, ప్రజలకు ఉపయోగపడే విధంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అభినందించారు.



మాదాపూర్ పబ్బులను తనిఖీ చేస్తున్న ఫైర్ సేఫ్టీ అధికారుల ఫోటోలు....

## గొట్టిముక్కల పద్మారావు అకాల మృతి పట్ల వారు తీవ్ర విచారం

### కుటుంబ సభ్యులను పరామర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**కూకట్ పల్లి, జూన్ 23 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ఉద్యమకారుడు గొట్టిముక్కల పద్మారావు ఇటీవల మరణించిన నేపథ్యంలో కూకట్‌పల్లిలోని వారి నివాసానికి వెళ్లి, కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించాడు.పద్మారావు చిత్రపటానికి కేటీఆర్‌తో పాటు ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేకానంద, ఎమ్మెల్సీలు నవీన్ రావు, శంభీపూర్ రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. గొట్టిముక్కల పద్మారావు అకాల మృతి పట్ల వారు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పద్మారావు కుటుంబ సభ్యులను ఓదార్చిన కేటీఆర్ పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

## కెపిహెచ్బి మెట్రో స్టేషన్ వద్ద నూతన పోలీస్ అవుట్ పోస్టు ప్రారంభం

### ప్రజలకు మెరుగైన సహాయాన్ని అందించడమే ఈ ఔట్ పోస్ట్ లక్ష్యం

### కూకట్ పల్లి డిప్యూటీ కమిషనర్ రితిరాజ్

**కూకట్ పల్లి, జూన్ 23 (ప్రభాత ఉదయం)**




కెపిహెచ్బి కూకట్పల్లి పోలీస్ స్టేషన్ లకు అనుబంధంగా, ప్రజల సౌకర్యార్థం మే లక్ష్యంగా అవుట్ పోస్ట్ ను ప్రారంభించామని కూకట్ పల్లి డిప్యూటీ కమిషనర్ రితిరాజ్ అన్నారు. ఈ ఔట్ పోస్టును మంగళవారం కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) రితిరాజ్ చేతుల మీదుగా మంగళవారం మెట్రో స్టేషన్ వద్ద పోలీస్ అవుట్‌పోస్ట్ ను ప్రారంభించారు. అనంతరం డిసిపి రితిరాజ్ మాట్లాడుతూ కెపిహెచ్బి మెట్రో స్టేషన్ పరిసర ప్రాంతాల్లో పోలీసుల ఉనికిని పెంచడం, ప్రజల భద్రతను బలోపేతం చేయడం, అత్యవసర స్పందన సమయాన్ని మెరుగుపరచడం, ప్రయాణికులకు, సాధారణ ప్రజలకు మెరుగైన సహాయాన్ని అందించడం అనే లక్ష్యాలతో ఈ పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేయబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సుదర్శన్, ఏసీపీ లు నరేష్ రెడ్డి, రవి కిరణ్ రెడ్డి, అలాగే కూకట్‌పల్లి, కెపిహెచ్బి, అల్లాపూర్ పోలీస్ స్టేషన్ల ఎస్ హెచ్ ఓలు, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శివరాంపల్లి దారుల్ ఉలూమ్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు ను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

## లోతట్టు ప్రాంతాలలను సందర్శించిన జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**బుద్వేల్, జూన్ 23 (ప్రభాత ఉదయం)**



శివరాంపల్లి బెస్ట్ ప్రైజ్ వద్ద వరద నీరు వెళ్ళే మ్యాన్ హోల్ ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

సోమవారం అర్ధరాత్రి నుంచి రాజేంద్రనగర్ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి జలమయమైన రాజేంద్రనగర్ జోన్ లోని వివిధ ప్రాంతాలను మంగళవారం ఉదయం రాజేం ద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారులతో కలసి పరిశీలించారు. నీరు వెళ్లడానికి కావల్సిన చర్యలను చేపట్టేలా అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం సమాచారాన్ని అధికారుల ద్వారా తెలుసుకున్న జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి హైడ్రా, ఇంజనీరింగ్ విభాగాల అధికారులను అప్రమత్తం చేసి కావాల్సిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. మద్య రాత్రి 2:15 నిమిషాలకు గ్రేటర్ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఫోన్ చేసి పరిస్థితిని తెలుసున్నట్లు జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. దీంతో తెల్లవారుజామున శ్రీనివాస్ రెడ్డి జోన్ పరిధిలో వర్షానికి నీరు నలచి ఉం డే 11 ప్రాంతాలను హైడ్రా, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలసి పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా అన్ని ప్రాంతాలలో నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. శివరాంపల్లి దారుల్ ఉలూమ్ వద్ద కూడా పై నుంచి వచ్చే వరద నీరు రాందేవ్ బాబా మందిరం నుంచి ఊర చెరువు గూండా మీరాలం చెరువులోకి సులభంగా వెళ్లడానికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చెరువుల ఆక్రమణలు, నాలాల ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగిస్తున్నామన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండ త్వరగా అన్ని ప్రాంతాలలో నీటిని తొలగించేలా చర్యలు తీసుకున్నారు. శివరాంపల్లి దారుల్ ఉలూమ్ వద్ద కూడా పై నుంచి వచ్చే వరద నీరు రాందేవ్ బాబా మందిరం నుంచి ఊర చెరువు గూండా మీరాలం చెరువులోకి సులభంగా వెళ్లడానికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చెరువుల ఆక్రమణలు, నాలాల ఆక్రమణలను గుర్తించి వాటిని తొలగిస్తున్నామన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండ అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వర్షా కాలంలో హైడ్రా, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యలున్న ప్రాంతాలలో ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. జోనల్ కమిషనర్ వెంట ఎస్ఈ నరేందర్ గౌడ్, అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీహెచ్ రాజు, హైడ్రా కు చెందిన సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ కట్టడికి గ్రేహౌండ్స్ దళం!



### శిక్షణ పూర్తి చేసుకున్న 150 మంది సిబ్బందికి సైబరాబాద్ సీపీ దిశానిర్దేశం.. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, బాధ్యతాయుతంగా పనిచేయాలి

### వర్షాకాలంలో, ఐటీ కారిడార్‌లో మరింత అప్రమత్తత అవసరం: సీపీ ఎం. రమేష్

**శేరిలింగంపల్లి : జూన్ 23,, (ప్రభాత ఉదయం)**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా సరికొత్త వ్యూహం సిద్ధమైంది. ట్రాఫిక్ విధుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన 150 మంది గ్రేహౌండ్స్ పోలీసు సిబ్బంది రంగంలోకి దిగుతున్నారు. వారం రోజుల పాటు సాగిన వీరి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్ సిబ్బందికి సమావేశంలో దిశానిర్దేశం చేశారు. శిక్షణలో నేర్చుకున్న ఇండోర్, అవుట్‌డోర్ అంశాల గురించి సీపీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నిర్వహణ, ట్రాఫిక్ ఇంజనీరింగ్, చట్టపరమైన అంశాలపై వీరికి పూర్తి అవగాహన కల్పించారు.

**ంనిబంధనల అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు.**

ఈ సమావేశంలో సీపీ మాట్లాడుతూ విధుల్లో భాగంగా ప్రజలతో అత్యంత మర్యాదపూర్వకంగా సేవాభావంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. హెల్మెట్ లేకపోవడం, లేన్ క్రమశిక్షణ తప్పడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ప్రాణాంతక ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ట్రాఫిక్ విధులకు ఆటంకం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని కేవలం చలానాలు వడ్డించడమే కాకుండా, ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పై చైతన్యం తీసుకురావాలని సీపీ పిలుపునిచ్చారు.

**ఐటీ కారిడార్, వర్షాకాలంపై ప్రత్యేక నజర్**

ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒత్తిడి అత్యధికంగా ఉంటుంది. దానికి తోడు ప్రస్తుత వర్షాకాలంలో సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ సహాయం అందిస్తూ పోలీసు శాఖపై పౌరుల్లో నమ్మకాన్ని, విశ్వాసాన్ని మరింత పెంచేలా ప్రవర్తించాలని బాధ్యతను గుర్తు చేశారు. ఈ అంతర్గత సమీక్షా సమావేశంలో సైబరాబాద్ పోలీస్ విభాగానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఎస్బీ డీసీపీ సుధీంద్ర, ట్రాఫిక్ డీసీపీ శేషాద్రిని రెడ్డి, సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్, సీఏఆర్ ఉ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, ట్రాఫిక్ అడ్మిన్ ఏడీసీపీ నరేందర్ సహా పలువురు పోలీసు అధికారులు పాల్గొని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

